# కవితా కౌముది

## బాటసారి

బాలాజీ పంజా



అటో ఇటో మలుపు తీసుకో
అలా అలా ముందుకు సాగిపో

చేరుకున్న గమ్యం చెబుతుంది
తీసుకున్న మలుపుకర్థం ఏంటని
తొలిమలుపుకు వెనకేముందో
తొలి అడుగుకు తెలియదు కదా

నీ అలుపెరుగని దారుల కథని
నీ గమనం గమనించని లోకానికి
నువు చేరిన తీరం చెబుతుంది
నీ అడుగుజాడలకు ఎదురు నడుస్తుంది
ఈ లోకం నీ తొలి అడుగును చేరేవరకు

నీ కాలిబాట ఎన్నో పయనాలకు ముందుమాట
పాదచారివై సాగిపోయిన ఓ బాటసారి

ఆశకి ఆకాశానికి
గమనానికి గమ్యానికి
తపస్సుకు వరానికి
నల్ల మేఘానికి నీలి సంద్రానికి
నీవొక రాయబారి.
ఓ బాటసారి నీవొక రాయబారి.

★★★



# నలిగే మనసు
## పి.వాహిని

నా మనసు నన్నే ప్రశ్నిస్తుంది.
నీవు ఎవరు అని?
నా దేహం నన్నే ప్రశ్నిస్తుంది.
ఇంకా నీ ప్రాణం నాలోనే ఉంది ఏమిటని?
నా కన్నులు నన్నే ప్రశ్నిస్తున్నాయి.
నీ కన్నీరు..నా కంట కారుతుంది ఏమిటని?
నా జీవితం నన్నే ప్రశ్నిస్తుంది.
ఇంకెంత కాలం నిన్ను శ్వాసించాలి అని?
అప్పుడు నేను అన్నాను
" నా కోసం మిగిలింది ఏది లేదు.
నీ పాదాల వద్ద నేను స్వీకరించేది....
ఒక్క మృత్యువే" అని...!

***



# నిశ్శబ్దం
## స్వాతి సాయి యాకసిరి

రాయి చుట్టూ ఆవరించుకున్న నిశ్శబ్దం
లోపలున్న దైవ ప్రతిమని ఎప్పుడు
దర్శించుకుందో ఏమో
ఉలిని చూడగానే
శిల్పికి ప్రణమిల్లుతూ
నెమ్మదిగా దైవ హృదయంలోకి చేరుకుంది...

★★★

భక్త హృదయాల కోరికల శబ్దాల ఆలాపనంతా
విగ్రహాన్ని తాకి పరావర్తనమవుతుందిప్పుడు

లోపలి దేవుడు
నిశ్శబ్దాన్ని తాగేసాడు మరి...!

★★★



# ఈ మౌనం
## లక్ష్మీరాధిక

ఈ మౌనం ఇప్పుడు పరుచుకున్నది కాదు
హృదయంలో చీకటి కురుస్తున్నప్పటి మాట
ఆ శిశిరానికి సవ్వడంటే తెలీదసలు..
ఆశలన్నీ ఒకేసారి నిరాశలై ఎలుగెత్తి
విషాదాన్ని పాడినట్టు
అదేపనిగా అపశృతుల అనంతమైన రొదలు..

పరితపించిన ప్రతిసారీ కలలు కనడం సహజమైనట్టు
విషాదం విరుచుకుపడ్డప్పుడు వేదన వ్యాప్తమవుతుంది
గుండెలో మొదలైన ఒత్తిడి..
గొంతులో ఉద్విగ్నమై కదులుతుంది..
నిద్దురంటని కళ్ళు రంగులను పోల్చుకోలేనట్లు
దీర్ఘమైన జ్ఞాపకాలున్నప్పుడు జీవితమెక్కడిది..?
మరణంలో అలికిడై మెలకువొచ్చినట్టు కానీ
ప్రాణమెప్పుడో పొలిమేర దాటేసుంటుంది..!!

★★★



# నేను
## ఎమ్.పద్మావతి

కరిగే కాలంలో..
పరిభ్రమించే ఋతువులు
మళ్ళీమళ్ళీ పలకరిస్తూనే ఉన్నాయి!
పగలు రేయిల భ్రమణంలో
ప్రతిక్షణం నీ జాడకై
నయనాలు వెదుకుతూనే ఉన్నాయి!
'మదిర' పానములో సోలుతూ
జ్ఞాపకాలను మస్తిష్కపు పొరలలో
సమాధి చేస్తూ నువ్వుంటే –
నిబిడీకృత నిశీధిలో ,
శిథిల స్వప్నాల వృత్తంలో,
యోజనాలు పరిభ్రమిస్తూ
భగ్న చరితలా 'నేను' ..!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

చిన్నతనముననీ త్రోవనెన్ని సార్లొ
నడచి వెళ్ళుట గుర్తు మనస్సులోన
ఇచట నిల్చిన యానాటి యిండ్లు గుర్తు
దారి ప్రక్కన నిల్చిన తరులు గుర్తు

క్షణము సేదదీరిన తరుచ్ఛాయ గుర్తు
ఒక్క క్షణమాగి పలికించు యుడుత గుర్తు
కొమ్మలను దాగు కోకిల గొంతు గుర్తు
కలసి నడచిన నా చెలికాండ్రు గుర్తు

ఇచట నడచుచు శైశవమిట్టె గడచె
అలసటెరుగకనిచటె బాల్యమ్ము గడచె
తరలిపోయిన వత్తును మరల మరల
మనసు నిండుగ కాంతును మరియు మరియు

ఇచటె మన స్నేహలత చిగురించె నాడు
వర్ధిలెను మన చెలిమి శాశ్వతము గాగ
నిలచినది బంధము ప్రకృతి నిలవలేదు
కదలిపోయితిమా స్మృతి కరగ సాగె

జ్ఞాపకమ్ముల నిల్చు దృశ్యములు లేవు
మదిని గీసిన చిత్రమ్ము మారిపోయె
జీవితమ్మున మార్పులెన్నెన్నొ కలుగు
స్పష్టముగ కొన్ని మన కంటపడక కొన్ని



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS